VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 02 ఫిబ్రవరి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 164

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

అధికార లాంఛనాలతో.. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య అంత్యక్రియలు.

# రూ.53.5లక్షల కోట్ల బడ్జెట్



2లో

మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదల

140కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం

బడ్జెట్ ప్రతిపాదనలపై ప్రధాని మోడీ వ్యాఖ్య





2లో

అద్భుత అవకాశాలకు ఈ బడ్జెట్ ఒక రహదారి. వికసిత్ భారత్-2047కు బలమైన పునాదిగా నిలుస్తుంది. దేశం ప్రయాణిస్తున్న సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌కు నూతన వేగం, నూతన శక్తి లభించడం తథ్యం. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలను బలోపేతం చేయడానికి రోడ్‌మ్యాప్‌గా తోడ్పడుతుంది. దేశ ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను కచ్చితంగా తీరుస్తుంది. మన పరిశ్రమలు లోకల్ నుంచి గ్లోబల్ స్థాయికి ఎదగడానికి ప్రభుత్వం సహకరిస్తుంది"

- వికసిత భారత్ దిశగా అడుగులు
- స్థిరంగా భారతదేశ ఆర్థిక ప్రయాణం
- ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నాం
- మూడు కర్తవ్యాలు లక్ష్యంగా సాధనే లక్ష్యం
- ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ రేటు ఆకాంక్ష
- బయో ఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు
- కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు
- 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూత
- మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం
- మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు

- 2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా
- మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు
- రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా
- 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్ లక్ష్యం
- కేంద్రబడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రతిపాదనలు





2లో

## సంక్షోభాలపై దృష్టి పెట్టని బడ్జెట్

ఎదురుదెబ్బలు తగులుతున్నా ఎదుర్కొనే మార్గం లేదు

బడ్జెట్ ప్రతిపాదనలపై రాహుల్ విమర్శలు



ప్రభాకర్‌రావు సర్వీసు మూడేళ్ల పొడిగింపులో

# మతలబేంటి?

**ఉద్యోగ విరమణ అనంతరం ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆయనే ఎందుకు!**

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను విచారించిన సిట్**

**పోలీస్ శాఖ ప్రతిపాదన మేరకే జరిగిందన్న మాజీ సీఎం**

హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారించే ప్రక్రియ ఆదివారం ఉత్కంఠ పరిణామాల మధ్య కొనసాగింది. భారాస శ్రేణుల ఆందోళనల నడుమ.. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలోనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆయన్ని విచారించింది. మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన విచారణ నాలుగున్నర గంటల సేపు సాగింది. విచారణ క్రమంలో సిట్ పలు ప్రశ్నలు అడిగి కేసీఆర్ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ముఖ్యంగా ఈ కేసులో నిందితులు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావుల పునర్నియామకాలతోపాటు ప్రణీత్‌రావు పదోన్నతి గురించి కేసీఆర్‌ను అడిగినట్లు తెలిసింది. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ప్రభాకర్‌రావును కొనసాగించాల్సిన అవసరంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఎవరినైనా పునర్నియమిస్తే సాధారణంగా రెండేళ్లకే అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ ప్రభాకర్‌రావుకు మాత్రం మూడేళ్లు పొడిగింపు ఇవ్వడం వెనక మతలబేంటి..? అంతటితో ఆగకుండా అసాధారణరీతిలో ఆయననే ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించాల్సిన అవసరమేంటి?.. అర్హత లేకున్నా ఆయననే చట్టబద్ధమైన ఇంటర్‌సెప్షన్(ఎల్ఐ)కు డిజిగ్నేటెడ్ అథారిటీగా నియమించడానికి కారణమేంటి.. లాంటి ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఫోన్ అక్రమట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావే ప్రధాన నిందితుడు కావడంతో ఈ కారణాలన్నీ కుట్రకోణాన్ని సూచిస్తున్నాయి కదా..! అని ఆరా తీసినట్లు సమాచారం. అలాగే 2007 ఎస్సై బ్యాచ్‌లో మరెవరికీ లేకుండా ఒక్క ప్రణీత్‌రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించాల్సిన అవసరమెందుకొచ్చింది..? అని అడిగినట్లు సమాచారం. ఈ క్రమంలో వాటికి సంబంధించి పోలీస్‌శాఖ నుంచే ప్రతిపాదన వచ్చిందని కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే భారాసకు కోట్ల రూపాయల విరాళాలు ఎలక్ట్రానిక్ బాండ్ల రూపంలో వచ్చాయని.. అలా ఇచ్చిన వారి ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఉండటంలో మతలబేమిటని ప్రశ్నించి వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు 'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో బహిర్గతమైన ఆడియో టేపులు మీకు ఎవరిచ్చారని సిట్ కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం.

# హైదరాబాద్ నుంచి హై స్పీడుగా..



తెలుగు రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల మధ్య రాకపోకలు వేగవంతమవుతాయి. హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదిత ఎలైన్‌మెంట్‌లో తెలంగాణలో స్టాపేజీలు కర్నూలుకు గంట..

**చెన్నై, బెంగళూరు, ముంబయి వంటి**

**నగరాలకు 350 కి.మీ. వేగంతో ప్రయాణం**

**మూడు వైపులా హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రకటించిన కేంద్రం**

హైదరాబాద్: అత్యాధునిక, అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైళ్లు అనగానే చైనా, జపాన్‌లనే గుర్తుచేసుకుంటాం. కొన్నేళ్లలో భారతదేశం పేరు కూడా ఈ జాబితాలో చేరనుంది. ప్రస్తుతం ముంబయి–అహ్మదాబాద్‌ల మధ్య హైస్పీడ్ కారిడార్ నిర్మాణ పనులు జరుగుతుండగా.. ఇప్పుడు ఏకంగా ఏడు హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టుల్ని మంజూరు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం కేంద్ర బిందువుగా మారనుంది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో మూడు ఇక్కడి నుంచే ప్రారంభం కానుండటం విశేషం. హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణె నగరాలకు ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఇవి కార్యరూపం దాల్చితే రవాణా ఆధారిత అభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని నగరాలు, పట్టణాల మధ్య రాకపోకలు వేగవంతమవుతాయి. హైదరాబాద్–చెన్నై హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదిత ఎలైన్‌మెంట్‌లో తెలంగాణలో స్టాపేజీలు కర్నూలుకు గంట.. అమరావతికి 75 నిమిషాలుదేశంలో వేగవంతమైన రైలు ప్రయాణం కోసం రాజధాని, శతాబ్ది, తాజాగా వందేభారత్ రైళ్లు వచ్చాయి. వందేభారత్ సీటింగ్ రైళ్ల గరిష్ఠ వేగం 150 కి.మీ. కాగా త్వరలో ప్రవేశపెట్టనున్న స్లీపర్ రైలుకు ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించగా 180 కి.మీ. వేగం అందుకుంది. దేశ రైలు చరిత్రలో ఇదే అత్యధిక వేగం. హైస్పీడ్ కారిడార్ రైలు ప్రాజెక్టులను 350 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా డిజైన్ చేస్తున్నారు.

# భగ్గుమన్న గులాబీ దళం



2లో

- కేసీఆర్‌పై సిట్ విచారణకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు
- రాష్ట్రవ్యాప్తంగా భారాస శ్రేణుల బైక్ ర్యాలీలు, రాస్తారోకోలు
- ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దహనం
- పలు చోట్ల ఉద్రిక్తత

సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా రాస్తారోకోలు చేశారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోటార్ సైకిల్ ర్యాలీలు చేపట్టారు. నల్లజెండాలు ధరించి నినాదాలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్ వద్దకు భారీగా భారాస నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి.. నినాదాలు చేశారు.

# తెలంగాణకు నిరాశ మిగిల్చిన బడ్జెట్



2లో

ఆశించిన కేటాయింపులు ఇవ్వని కేంద్రం

బడ్జెట్ ప్రతిపాదనలపై భట్టి మండిపాటు

ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు.



2లో

## దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసేలా బడ్జెట్

ఎరువుల రాయితీతో రైతులకు లబ్ధి

బడ్జెట్‌పై కిషన్ రెడ్డి వ్యాఖ్య

వేగుచుక్క

## తెలంగాణకు నిరాశ మిగిల్చిన బడ్జెట్



హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బ్జడెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు. ఆరెంజ్ ఎకానమిలో హైదరాబాద్ కేంద్రం.. . దానిని కూడా ముంబయికి తరలించారని, తెలంగాణ రాష్ట్రం ఏం తప్పు చేసిందని భట్టి ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ హబ్ అని మెన్షన్ చేసినా... అందులో కూడా తెలంగాణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించినా...టూరిజం విషయంలో కూడా రాష్ట్రానికి నిధులు కేటాయింపు జరగలేదన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి న్యూజిలాండ్ ట్రైబ్స్ కూడా వచ్చారని.. కానీ, కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. బ్జడెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.

## భగ్గుమన్న గులాబీ దళం



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా..భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా భారాస శ్రేణులు ఆదివారం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా రాస్తారోకోలు చేశారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోటార్ సైకిల్ ర్యాలీలు చేపట్టారు. నల్లజెండాలు ధరించి నినాదాలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్ వద్దకు భారీగా భారాస నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి.. నినాదాలు చేశారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం వద్దకు వెళ్లబోయిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. నిరసనగా నల్ల జెండాలతో ఆందోళన చేపట్టారు. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తెలంగాణభవన్‌లో సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, తలసాని, మధుసూదనాచారి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, రాగిడి లక్ష్మారెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఖమ్మంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు వెళ్తున్న భారాస నేత, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులుహైదరాబాద్‌లోని బాలాపూర్ చౌరస్తాలో, మీర్‌పేటలో చేపట్టిన నిరసనల్లో మాజీ మంత్రి సబితారెడ్డి పాల్గొన్నారు. పెద్ద అంబర్‌పేటలో జాతీయ రహదారిపై ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భారాస విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌ను ముట్టడించగా.. పోలీసులు అరెస్టు చేశారుసిరిసిల్లలో భారాస నేతలు, కార్యకర్తలు..సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో బైక్ ర్యాలీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల ఊరేగింపులతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపల్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు.వరంగల్ చౌరస్తాలో రోడ్డుపై నిరసన వ్యక్తంచేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ సహా పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ కార్యకర్తలు రాస్తారోకో చేశారు.ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌ల నేతృత్వంలో నల్ల జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు.మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నేతృత్వంలో కార్యకర్తలు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పెద్దపల్లి జిల్లా మంథనినిలో సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.

## దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసేలా బడ్జెట్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ముందుకు తీసుకెళ్లేలా బడ్జెట్ రూపకల్పన చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన దిల్లీలో విలేకర్లతో మాట్లాడారు. రైతులకు అండగా నిలిచేందుకు ఎరువుల రాయితీని కేంద్ర ప్రభుత్వం పెంచిందని చెప్పారు. ఎరువులపై రాయితీ వల్ల తెలంగాణ రైతులు కూడా లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ గతేడాది కంటే ఈసారి పెరిగిందన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు లబ్ధి కలిగే పథకాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక్కో బాలికల హాస్టల్‌ను కేంద్రం ఏర్పాటు చేయనుంది. తెలంగాణలోని 33 జిల్లాలకు బాలికల హాస్టళ్లు మంజూరు అవుతాయి. డేటా సెంటర్లకు ఉపయోగపడే నిర్ణయాన్ని మోదీ సర్కారు తీసుకుంది. డేటా సెంటర్లకు ఇచ్చే ప్రోత్సాహం వల్ల తెలంగాణకూ లాభం. విదేశీ విద్య కోసం వెళ్లే విద్యార్థులపై ఉండే పన్నును 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించారు. విదేశీ విద్యపై పన్ను తగ్గించటం వల్ల తెలుగు విద్యార్థులకు ఎంతో మేలు. రైల్వే బ్జడెట్‌ను రూ. 2.77 లక్షల కోట్లకు పెంచింది. రాష్ట్రానికి మూడు హైస్పీడ్ రైళ్లు రానున్నాయి. మెట్రో రైలు గురించి ప్రత్యేకంగా బ్జడెట్‌లో ఉండదు. మెట్రోపై డీపీఆర్ ఇస్తే.. పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇస్తుంది. మెట్రో రైలు ప్రాజెక్టుకు మంత్రివర్గ ఆమోదంతో నిధులు వస్తాయి. ప్రస్తుత మెట్రో ప్రాజెక్టు టేకోవర్ పక్రియ పూర్తి చేసి డీపీఆర్ ఇస్తే కేంద్రం ఆమోదిస్తుంది. దేశంలో ఉపాధి అవకాశాలు పెంచేలా మోదీ సర్కారు చర్యలు చేపట్టిందని కిషన్ రెడ్డి వెల్లడించారు.

# రూ.53.5 లక్షల కోట్ల బడ్జెట్





న్యూఢిల్లీ: భారతదేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోందని, యువశక్తి కేంద్రంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నామని, గ్లోబల్ మార్కెట్లతో పోటీ పడుతూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. లోక్ సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. లోక్ సభలో 2026-27 బడ్జెట్ గురించి నిర్మలా సీతారామన్ ప్రసంగించారు. కేంద్ర బడ్జెట్.. మూలధన వ్యయం రూ. 12.20 లక్షల కోట్లు.. కాగా.. 2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా వేశారు. 2027లో రూ. 28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా వేశారు. ప్రభుత్వానికి బాసటగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మూడు కర్తవ్యాలను లక్ష్యాలుగా ప్రకటించారు. ప్రజల ఆశయాలను అందుకోవడమే తమ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలతో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలియ జేశారు. ఈ బ్జడెట్ ను యువశక్తి బడ్జెట్‌గా అభివర్ణించారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్‌లో రూపొందించిన బడ్జెట్ ఇదంటూ పేర్కొన్నారు.నిర్మాణాత్మక సంస్కరణలతో ఈ కార్యవ్యాలను సాధిస్తామని, ఇది యూనిక్ బడ్జెట్ అని పేర్కొన్నారు. ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ ఉంటుందని అన్నారు. కర్తవ్యం1: సమ్మిళిత ఆర్థిక వృద్ధి. కర్తవ్యం 2: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం 3: సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని తెలిపారు. బయో ఫార్మా రంగానికి రూ. 10 వేల కోట్లు, ఏపి, ఒడిశా, తమిళనాడు, కేరళలో గనుల కారిడార్, మూడు డెడికేటెడ్ కెమికల్ పార్క్‌ల నిర్మాణం చేపడుతామని, ప్రస్తుతమున్న ఎన్ఐపిఇఆర్ఎస్ ఆధునీకరించడంతో పాటు దేశంలో రెండు హైటెక్ టెక్నాలజీ రూమ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కంటైనర్ నిర్మాణ రంగానికి రూ. 10 వేల కోట్లు, దేశంలో కొత్తగా మూడు కెమికల్ రీసెర్చ్ పార్కులు, సెమీకండక్టర్ మిషన్ కోసం రూ. 40 వేల కోట్లు, జౌళి రంగానికి కేంద్ర బ్జడెట్‌లో చేయూతనివ్వడంతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం చేపడుతామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సెమీ కండక్టర్ మిషన్ 2.క్ష ప్రారంభిస్తామని, త్వరలో నేషనల్ ÷బైర్ స్కీమ్ ప్రారంభం, టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి కొత్త పథకం, దేశంలో కొత్త మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ఖాదీ, హ్యాండ్లూమ్, హస్తకళల ప్రోత్సాహానికి పథకం ఏర్పాటు చేస్తామని, అత్యంత నాణ్యత కలిగిన క్రీడా వస్తువుల తయారీకి పథకం ఉంటుందని, 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూతనిస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు రూ. 2 వేల కోట్లు కేటాయించడంతో పాటు ఎస్ఎంఇ రంగానికి రూ. 10 వేల కోట్లు ఇస్తామని, మైక్రో సెక్టార్‌కు రూ. 2 వేల కోట్లు ఇస్తామని, ఆత్మనిర్భర్ భారత్‌కు రూ. 2 వేల కోట్లు ఇస్తామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. నగరాలే దేశ గ్రోత్ ఇంజిన్లు అని, రెండో, మూడో స్థాయి నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పాట్నా, వారణాసిల్లో షిప్ రిపేర్ ఎకోసిస్టమ్, ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్ల అభివృద్ధితో పాటు ముంబై- పుణెళి, పుణెళి-హైదరాబాద్, హైదరాబాద్- చెన్నై రూట్లలో హైస్పీడ్ రైల్ కారిడార్లు నిర్మించడంతో పాటు ఢిల్లీ- వారణాసి, వారణాసి- సిలిగురి మార్గాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థిరత ఆర్థికాభివృద్ధి సాధించడం. మొదటి కర్తవ్యంలో భాగంగా ఈ ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. ఏడు వ్యూహాత్మక, నిర్దేశిత రంగాల్లో ఉత్పాదతక ను వేగవంతం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింపజేయడం వంటివి ప్రధానంగా ప్రస్తావించారు. వికసిత్ భారత్ థీమ్‌గా బడ్జెట్ ఉందన్నారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ మాదిరిగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఉపాధి, వృద్ధిని ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం ఎంతో చేసిందని నిర్మలా సీతారామన్ అన్నారు. 2025లో 350కి పైగా సంస్కరణలు ప్రారంభించినట్లు చెప్పారు.కొన్ని వస్తువులకు పన్నుల మినహాయింపులు, తగ్గింపును ప్రకటించారు. దీంతో పలు వస్తువుల ధరలు తగ్గనున్నాయి. మరికొన్ని వస్తువుల ధరలు మాత్రం మరింత పెరగనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ఊతం. దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం వంటివి ప్రతిపాదించారు. టెక్ టూల్ రూమ్స్ ఏర్పాటు, పరిశ్రమలకు విద్యాసంస్థల అనుసంధానం మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు. 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం. టెక్స్‌టైల్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ. 10వేల కోట్లు. జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూ. 10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయో ఫార్మా శక్తి పథకం. ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో మూడు కొత్త విద్యా సంస్థల స్థాపన. రెడో కర్తవ్యం.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్ దిశగా అడుగులు వేసేలా భాగం చేయడం. ఈ దిశగా ఇప్పటికే అడుగులు పడినట్లు తెలిపారు. గత పదేళ్ల కాలంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం, సంస్కరణల కారణంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు. ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో మెడికల్ టూరిజం సర్వీసులు. ఐదు రీజినల్ మెడికల్ హబ్స్ ఏర్పాటు. ఆయుష్ కేంద్రాల అప్‌గ్రేడేషన్, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్‌నగర్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటు. ప్రైవేటు రంగంలో పశువైద్య, డయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం. యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సుల ఏర్పాటు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్ రంగాలకు చేయూత. నేషనల్ డిజిటల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు. ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా క్రీడాభివృద్ధి. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ విజన్‌తో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, మతం, రంగానికి వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభివృద్ధిలో అర్థవంతమైన భాగస్వాములుగా చేయడం. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం. దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన, దివ్యాంగ్ సహకార యోజన. మానసిక వ్యాధుల చికిత్సకు రాంచీ, తేజ్‌పూర్‌లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ అప్‌గ్రేడేషన్. భారత్ విస్తార్ (వర్చువల్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సిస్ అగ్రికల్చర్ రిసోర్స్) వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి పెంపు, మదింపు చేసి, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేలా ప్రోత్సహించడం తూర్పు ప్రాంతంలోని 5 పూర్వోదయ రాష్ట్రాల పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇందు కోసం 4వేల ఇ-బస్‌ల అందించటం. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి.

## మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుదల



న్యూఢిల్లీ:కేంద్ర బడ్జెట్ 2026 -27 పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనర చేస్తుందని, ఇది చరిత్రాత్మక బ్జడెట్ అని కొనియాడారు. బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది‘ అని చెప్పారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ ఆ ఎక్స్‌ప్రెస్‌కు బ్జడెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు.
భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు

అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.

## సంక్షోభాలపై దృష్టి పెట్టని బడ్జెట్



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్ష నేతల పెదవి విరిచారు. దేశంలో యువతకు ఉద్యోగాలు లేవు. తయారీ రంగం పతనమవుతోంది. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ దేశాల నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఈ సంక్షోభాల గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావన లేదు. దేశంలో వాస్తవ సమస్యలను కేంద్రం పట్టించుకోవట్లేదని విపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది దేశంలోని వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బడ్జెట్ అని ఎక్స్ వేదికగా విమర్శలు ఎక్కుపెట్టారు. 'యువతకు ఉద్యోగాలు లేవు, కుంగుతున్న తయారీ రంగం, పెట్టుబడులను వెనక్కు తీసుకుంటున్న ఇన్వెస్టర్లు, సంక్షోభంలో రైతాంగం, అంతర్జాతీయ సంక్షోభాలతో ఎదురవుతున్న ముప్పు.. వీటన్నిటినీ బ్జడెట్‌లో పట్టించుకోలేదు. ఇది తప్పులు సరిదిద్దుకోలేని బడ్జెట్, దేశంలోని వాస్తవ సంక్షోభాలను పట్టించుకోని బ్జడెట్' అని ఎక్స్ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా బడ్జెట్‌పై విమర్శలు ఎక్కుపెట్టింది. బడ్జెట్ నిస్సారంగా ఉందని కామెంట్ చేసింది. బడ్జెట్ మొత్తాన్ని ఇంకా చదవాల్సి ఉన్నప్పటికీ 90 నిమిషాల బడ్జెట్ ప్రసంగాన్ని గమనిస్తే ఇది అంచనాలను అసలేమాత్రం అందుకోలేదనే చెప్పాలి. పూర్తి నిస్సారంగా ఉంది. బ్జడెట్‌లో పారదర్శకత లోపించింది. ముఖ్య పథకాలు, కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు' అని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ విమర్శించారు.

## ద్రవ్యలోటును 4.3 శాతానికి తగ్గించాలని లక్ష్యం

**పన్ను వసూళ్లు రూ.28.70 లక్షల కోట్లుగా అంచనా**

**మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు**

**వివిధ రంగాలకు కేటాయింపులు**

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతేడాదితో పోలిస్తే ద్రవ్యలోటు 0.1 శాతం తగ్గినట్టు మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 4.3 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అలాగే రాబోయే ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లు రూ. 28.70 లక్షల కోట్లు అని అంచనా వేశారు. ఇక, మూలధన వ్యయం రూ. 12.20 లక్షల కోట్లు అని పేర్కొన్నారు. 2026-27బడ్జెట్‌లో ఏ రంగానికి ఎంత కేటాయించారంటే రక్షణ రంగానికి కేటాయింపుల పెరిగాయి. రవాణా రంగం - రూ. 5,98,520 కోట్లు,రక్షణ రంగం - రూ. 5,94,585 కోట్లు,గ్రామీణాభివృద్ధి - రూ. 2,73,108 కోట్లు, హోంశాఖ - రూ. 2,55,234 కోట్లు,వ్యవసాయం - రూ. 1,62,671 కోట్లు,విద్యా రంగం - రూ. 1,39,289 కోట్లు,ఇంధన రంగం - రూ. 1,09,029 కోట్లు,ఆరోగ్య రంగం - రూ. 1,04,599 కోట్లు,పట్టణాభివృద్ధి - రూ. 85,522 కోట్లు, కామర్స్ అండ్ ఇండస్ట్రీ - రూ. 70,296 కోట్లు,సోషల్ వెల్ఫేర్ - రూ. 62,362 కోట్లు సైంటిఫిక్ డెవలప్‌మెంట్ - రూ. 55,756 కోట్లు,ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ - రూ. 45,500 కోట్లు,విదేశీ వ్యవహారాలు - రూ. 22,119 కోట్లు,ఫైనాన్స్ - రూ. 20,649,ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి - రూ. 6,812 కోట్లు కేటాయించారు.

## వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు

**ఎన్నికల సంఘానికి పెరిగిన కేటాయింపులు**

**25.33 శాతం పెరిగిన నిధుల కేటాయింపు**

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ఆదివారంనాడు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎన్నికల కమిషన్ కు నిధుల కేటాయింపు 25.33 శాతం పెరిగింది. 2025-26లో రూ. 304.98 కోట్లుబడ్జెట్‌లో కేటాయించగా, 2026-27 బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ. 382.22 కోట్లకు పెంచారు. ఎన్నికల సంఘానికి కేటాయించిన నిధుల్లో రూ. 367.69 కోట్లు ఎన్నికల సంబంధిత వ్యయం కాగా, తక్కిన మొత్తాన్ని పరిపాలన, నిర్వహణా ఖర్చులకు వెచ్చిస్తారు. రాబోయే రెండేళ్లలో పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం రెండో విడత ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోంది. ఈ పక్రియలో అధికార బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కై పెద్దఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారంటూ విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఈసీకి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు 25 శాతం పెరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది తమిళనాడు, పశ్చిమబెంగాల్,ద

అస్సాం, కేరళ రాష్ట్రాల్లోఅసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2027లో ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లో ఎన్నికలు ఉంటాయి. ఎన్నికల కమిషన్‌కు కేంద్రం కేటాయించిన నిధులను సాంకేతికత, ఎన్నికల నిర్వహణ, ఓటర్ల అవగాహన తదితర కార్యక్రమాల కోసం వినియోగిస్తారు. ఈవీఎంలు, వీవీపాట్ యంత్రాల ఆధునీకరణ, పోలింగ్ కేంద్రాల భద్రతకు కూడా ఈ నిధులు వెచ్చిస్తారు.

## బడ్జెట్ ప్రతిపాదనలతో మార్కెట్ షేక్

**భారీ అస్థిరతకు లోనైన భారత మార్కెట్లు**



న్యూఢిల్లీ: బడ్జెట్‌వేళ.. దేశీయ మార్కెట్లు భారీ నష్టాలతో ముగిశాయి. కేంద్రం.. బడ్జెట్ 2026 ప్రవేశపెట్టిన ఈ చారిత్రాత్మక ఆదివారం నాడు భారత స్టాక్ మార్కెట్లు భారీ అస్థిరతకు లోనయ్యాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైనప్పటికీ.. బడ్జెట్ ప్రసంగం ముగిసే సమయానికి ఇన్వెస్టర్లు ఒక్కసారిగా అమ్మకాలకు మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒక్కసారిగా నేలకు దిగాయి. నూతన బ్జడెట్‌లో కంపెనీల బైబ్యాక్‌పై పన్ను విధించడం సహా ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను పెంచడం మార్కెట్ల పతనానికి కారణమైంది.కానొక దశలో 2400 పాయింట్లకు పైగా పతనమై 80వేల దిగువకు చేరిన సెన్సెక్స్.. చివరకు 1546 పాయింట్లు పతనమై 80,722 వద్ద స్థిరపడింది. 495 పాయింట్ల భారీ నష్టాన్ని చవిచూసిన నిఫ్టీ.. 24,119 వద్ద ముగిసింది. బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం అయినప్పటికీ పనిచేసిన మార్కెట్లు.. మదుపర్లకు బ్లాక్‌సండేను మిగిల్చాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజున సెన్సెక్స్, నిఫ్టీలు ఇంత భారీ స్థాయిలో పతనమవడం గత ఆరేళ్లలో ఇదే తొలిసారి. బడ్జెట్ ప్రసంగానికి ముందు ఎ÷-లాట్‌గా ట్రేడైన సూచీలు.. మధ్యలో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్(ఎస్‌టీటీ) ప్రస్తావన రావడంతో మెల్లగా నష్టాల్లోకి జారుకున్నాయి. తాజా బడ్జెట్‌లో ఎస్‌టీటీని 0.02 నుంచి 0.05 శాతానికి పెంచుతున్నట్టు కేంద్రం ప్రకటించింది.ఎస్‌టీటీని పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో బ్రోకరేజీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో 18 శాతం వరకు ఆయా కంపెనీల షేర్లు ఒక్కసారిగా పతనమయ్యాయి. బీఎస్‌ఈలో మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ షేర్లు 18.08 శాతం మేర పడిపోయి.. రూ. 2,068కి చేరింది. గ్రో మాతృ సంస్థ బిలియన్ బ్రెయిన్ గ్యారెజీ వెంచర్స్ షేర్లు 13 శాతం మేర క్షీణించి రూ. 154కు చేరాయి.
ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ 10.4 శాతం పతనమై రూ. 296.10కి చేరింది. ఏంజెల్ వన్ స్టాక్ కూడా 11.84 శాతం మేర నష్టపోయి రూ. 2,237.95కి పడిపోయాయి.

## మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకం

**బెంగాల్‌కు కేటాయింపులను పట్టించుకోని కేంద్రం**

**బడ్జెట్‌పై మండిపడ్డ మమతా బెనర్జీ**



**కోల్‌కతా:** మహిళలు, యువత, రైతులకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ తో సామాన్యులకు ప్రయోజనమేమీ లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. కేంద్ర బ్జడెట్-2026పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని తప్పుదారి పట్టించిందని, బెంగాల్‌కు రావాల్సిన నిధుల వాటాను నిలిపివేసిందని అన్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనాలు చేకూర్చడానికి బదులుగా కొత్త ఆర్థిక కారిడార్ల పేరుతో పచ్చి అబద్ధాలు చెబుతోందని, మాటల గారడీకి పాల్పడిందని తప్పుపట్టారు. బడ్జెట్‌లో కేంద్రం ప్రస్తావించిన ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇప్పటికే చేపట్టామని, మూడు కారిడార్లంటూ కేంద్రం చెబుతున్నవన్నీ అబద్ధాలేనని అన్నారు. పురులియాలో జంగల్ మహల్ జంగల్ సుందరి ప్రాజెక్టును మమతా బెనర్జీ ప్రస్తావిస్తూ, కేంద్రం నుంచి సపోర్ట్ లేకుండానే ఈ ఎకనామిక్ కారిడార్‌ను రూ. 72,000 కోట్ల పెట్టుబడితో ఎ÷-లాన్ చేశామని తెలిపారు. బెంగాల్ నుంచి పెద్దమొత్తంలో పన్నులను కేంద్రం వసూలూ చేస్తూ రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయడంలో మాత్రం విఫలమైందని టీఎంసీ అధినేత్రి ఆరోపించారు. 'బెంగాల్‌కు వాళ్లు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. జీఎస్‌టీ అంటూ వాళ్లు మా సొమ్ములు తీసుకుంటూ మాకు డబ్బులు ఇస్తున్నట్టుగా చాలా పెద్ద మాటలు చెబుతున్నారు. అది ముమ్మాటికీ మా సొమ్మే' అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పశ్చిమ బెంగాల్‌కు రూ. 2 లక్షల కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉన్నాయని, తమకు న్యాయబద్ధంగా రావాల్సిన నిధులను కేంద్రం నిలిపివేసిందని చెప్పారు. దేశ ఆర్థిక, రాజ్యాంగబద్ధ, సమాఖ్య వ్యవస్థను కేంద్రం ధ్వంసం చేస్తోందని, ఈ రకంగా ప్రభుత్వాన్ని నడిపే నైతిక అధికారాన్ని కేంద్రం కోల్పోయిందని మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు.

## విదేశీ విద్యకు వెళ్లే వారికి ఊరట

**టాక్స్ కలెక్టడె ఎట్ సోర్స్‌ను 2శాతానికి తగ్గింపు**

న్యూఢిల్లీ:విదేశీ విద్యా నిధుల ప్రవాహం తగ్గుముఖం పడుతున్న తరుణంలో కేంద్ర బడ్జెలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రతిపాదనలు చేశారు. విదేశాల్లో చదువుకోవాలనే భారతీయ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఊరట కల్పించే ప్రకటన చేశారు. సరళీకృత చెల్లింపు పథకం కింద విదేశాలకు పంపే విద్యా నిధులపై టాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్‌ను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. విదేశీ విద్యతో పాటు వైద్య అవసరాల కోసం పంపే నిధులపై గతంలో 5శాతం టీసీఎస్ ఉండగా.. దాన్ని 2శాతానికి తగ్గిస్తున్నట్లు తెలిపారు. తాజా ప్రతిపాదనతో రూ. 10లక్షల కన్నా ఎక్కువ మొత్తాన్ని విదేశాలకు పంపేవారికి ప్రయోజనం చేకూరనుంది. తాజా ప్రతిపాదనలతో విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులు ఇకపై తక్కువ పన్ను చెల్లించాల్సి ఉంటుంది.
దీనివల్ల మధ్యతరగతి కుటుంబాలపై తక్షణ నగదు భారం తగ్గుతుంది. జర్మనీ వంటి దేశాలకు వెళ్లే వారికి దీనివల్ల ఎక్కువ ప్రయోజనమని చెప్పొచ్చు. ఎందుకంటే.. జర్మనీలో విద్యకోసం వెళ్లే విద్యార్థులు అక్కడి 'బ్లాక్డ్ అకౌంట్'లో దాదాపు ?12 లక్షలకు పైగా జమ చేయాల్సి ఉంటుంది. గతంలో 5? ÷ుఅ÷ు ఉండేది, ఇప్పుడు అది 2శాతానికి తగ్గించడంతో విద్యార్థులకు కొన్ని వేల రూపాయల మేర ఆదా కానుంది.

వేగుచుక్క

# పాలక పార్టీల ఫాసిస్టు విధానాలపై పోరాడుదాం.

**సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు.**

**'విప్లవ కార్యశూరుడు కర్నాటి యాదగిరి' పుస్తకం ఆవిష్కరణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**






పాలక పార్టీల ఫాసిస్టు విధానాలపై పోరాడుదాం అని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు.ఆదర్శ కమ్యూనిస్టు, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు యాదగిరి ప్రథమ వర్ధంతి సభను పార్టీ అర్బన్, రూరల్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గాయత్రి నగర్ లోని శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండలంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా పార్టీ శ్రేణులు యాదగిరన్న, అనసూయక్క చిత్రపటానలకు పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సంతాప సభకు సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ నిజామాబాద్ అర్బన్, రూరల్ జిల్లా కార్యదర్శులు వనమాల కృష్ణ, వి. ప్రభాకర్ లు అధ్యక్షత వహించారు.
సభలో 'విప్లవ కార్యశూరుడు కర్నాటి యాదగిరి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య వక్తగా వచ్చిన సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ, యాదగిరన్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో చురుకైన పాత్ర వహించాడన్నారు. ఉద్యమమే వృత్తిగా, ప్రవృత్తిగా ఆదర్శ కమ్యూనిస్టుగా బ్రతికిన కర్నాటి యాదగిరన్నకు సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ విప్లవ జోహార్లు అర్పిస్తున్నదన్నారు.
కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రశ్నించే వ్యక్తులను, శక్తులను, ప్రతిపక్షాలను నిర్బంధానికి గురిచేస్తుందన్నారు. తన విధానాలను నిరసించిన వారిపై సీబీఐ, ఈడీలను ఆయుధాలుగా మార్చుకున్నదన్నారు. చివరకు ఎన్నికల కమీషన్, న్యాయ వ్యవస్థలను సైతం జేబు సంస్థలుగా మార్చుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలన్నారు. అదే యాదగిరన్నకు నిజమైన నివాళి అవుతుందన్నారు.

**పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచందర్, కే. రమలు మాట్లాడుతూ,**

ప్రభుత్వ ఉద్యోగాన్ని తృణప్రాయంగా త్యజించి, జీవితాంతం విప్లవోద్యమమే జీవితంగా, ఆదర్శవంతంగా బ్రతికిన యాదగిరన్న కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శమన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, దాదాపు 33 ఏళ్లు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా
పనిచేశారన్నారు. అలుపెరుగని, చెక్కుచెదరని దృడవిశ్వాసంతో ప్రజాపంథా రాజకీయ అవగాహన వెనుక నిలబడ్డ యాదగిరన్న అంకితభావ జీవితం ఎంతో ఆదర్శవంతమైందన్నారు. అరుణోదయ కళాకారులు తమ పాటలతో నివాళి అర్పించారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.నరేందర్, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు ఏం వెంకన్న ఎం.ముత్తెన్న, యాదగిరి కుటుంబ సభ్యులు ఏ.రవీందర్ సుధారాణి, సంధ్యారాణి లు మాట్లాడారు. ఈ సంతాప సభలో పార్టీ జిల్లా నాయకులు కే.గంగాధర్, ఎం. సుధాకర్, బి.మల్లేష్, ఎస్.సురేష్, జి. గంగాధర్, డి.కిషన్, సత్తెక్క, ఆర్.రమేష్, కిషన్, రాజేశ్వర్, ప్రజా సంఘాల నాయకులు వి.సంఘం, బి.ఎన్.బి, సిర్ప లింగం, వి. గోదావరి, భాస్కర స్వామి, నరేందర్ గణేష్, అనిల్, నవీన్ మరియు వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు కార్మికులు రైతులు రైతుకూలీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ సౌమ్య మృతి పట్ల అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సంతాపం.

**- నిషేధిత గంజాయి పై అధికారులు, ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలనీ డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



గంజాయి అరాచక ముఠా జరిపిన దాడిలో గాయపడి, తొమ్మిది రోజులపాటు చావు బతుకులతో పోరాడుతూ శనివారం రాత్రి తుదిత్వాస విడిచిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ సంతాపం తెలిపారు. నిషేధిత గంజాయి ఏరివేత కోసం తను నిర్వహిస్తున్న విధుల్లో భాగంగా ఆమెను తీవ్రంగా దాడి చేయడాన్ని బిజెపి పార్టీ తరఫున తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్బన్ నియోజకవర్గం గంజాయి రహిత జిల్లాగా ఉండేటట్లు ఎక్సైజ్ అధికారులు ఇకపై గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. చిన్న వయసులోనే ఉద్యోగం సంపాదించి ఎన్నో కలలు కన్న కానిస్టేబుల్ సౌమ్య తొమ్మిది రోజులపాటు చావు బతుకులతో పోరాడి శనివారం రాత్రి మరణించారనే వార్త తనకు ఎంతో బాధ కలిగించిందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి వహించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఎక్స్గ్రేషియా ప్రకటించాలని అన్నారు. అలాగే ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పేదలకు అనుకూలమైన కేంద్ర బడ్జెట్.

**ఈ బడ్జెట్ వల్ల దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికి మేలు చేకూరుతుంది.**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు అనుకూలమైనదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. ఆదివారం పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు, అలాగే రోజువారి పనులు చేసుకునే వారికి ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగదాయకమని ఆయన అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ తో దేశం మరికొన్ని రోజుల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, ప్రపంచంలోనే అన్ని దేశాలకు మార్గదర్శకంగా నిలిచి ప్రపంచ దేశాల సరసన నిలబడడం ఖాయమన్నారు. భారతదేశంలో ఉన్న ప్రతి పౌరుడుకి ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఉపయోగం చేకూరుతుందని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఏ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టని విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచనలతో ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్ ను రూపొందించారని ఎమ్మెల్యే కొనియాడారు. బడ్జెట్ పై ప్రతిపక్షాలు చేస్తున్న కల్పితాలను ప్రజలు నమ్మకూడదని ఈ బడ్జెట్ కేవలం దేశాభివృద్ధి కోసమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఆర్థిక పునాదులను బలోపేతం చేసేలా బడ్జెట్

**అమరావతి:** ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం సమర్పించిన 2026-2027 కేంద్ర బడ్జెట్‌ను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. భారతదేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేసే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. సంస్కరణల ఆధారిత, యువత - ప్రేరేపిత బ్జడెట్‌ను సమర్పించినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు. బడ్జెట్ భారతదేశం ..వికసిత్ భారత్ వైపు ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. ఉపాధి కల్పన, ఆవిష్కరణ, నగర ఆర్థిక ప్రాంతాలు, హై-స్పీడ్ రైలు కారిడార్లపై ప్రాధాన్యత ప్రాంతాలు, రంగాల్లో వృద్ధిని పునర్నిర్మిస్తుందని పేర్కొన్నారు. ప్రధాన కేంద్రాలను అనుసంధానించే హై స్పీడ్ రైలు లింక్‌ల అభివృద్ధి ద్వారా.. మౌలిక సదుపాయాల కల్పనతో లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తుందని చెప్పారు. అలాగే స్థిరమైన రవాణాను ప్రోత్సహిస్తుందని వివరించారు. ఏపీ కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో అరుదైన భూమి కారిడార్లు, తూర్పు తీర పారిశ్రామిక కారిడార్, మెరుగైన ప్రజా మూలధన వ్యయం, మత్స్యకార అభివృద్ధి, తీరప్రాంత లాజిస్టిక్స్‌కు ప్రాధాన్యత ఇచ్చారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఏపీ వ్యాప్తంగా పెట్టుబడి వృద్ధి, పెద్ద ఎత్తున ఉపాధి, సమగ్ర అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. రాష్ట్రాలకు సాధికారత కల్పించడం, మధ్యతరగతిని బలోపేతం చేయడం ద్వారా స్వావలంబనతో కూడిన భారతదేశాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌తో ఎపికి కొత్త అవకాశాలు

**ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్ అని పేర్కొన్న సిఎం చంద్రబాబు**

చిత్తూరు: 2047 వికసిత్ భారత్ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆదివారం బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశ పెట్టిందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌తో ఏపీకి కొత్త అవకాశాలు వస్తాయని వివరించారు. ఇది ఫార్వార్డ్ లుకింగ్ బడ్జెట్ అని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఆదివారం కుప్పంలో సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింతగా దూకుడుగా వెళ్లేందుకు ఈ బ్జడెట్ సహకరించేలా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విదానానికి ఈ బ్జడెట్ మరింత సహకరించేలా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించిందని... వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బ్జడెట్ ఉందని చెప్పుకొచ్చారు. 2047 వికసిత్ భారత్ డెవలప్‌మెంట్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్థిక మంత్రి బ్యాలెన్స్‌డ్ బ్జడెట్ ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఏఐతో సహా వివిధ టెక్నాలజీలు, నెక్ట్స్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్‌కు వెళ్తుందని పేర్కొన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ, వన్ గ్రిడ్ నేషన్ దిశగా బ్జడెట్ ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. 'స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బ్జడెట్ రూపొందించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బ్జడెట్ ఉంది. హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉంది.
తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ హైస్పీడ్ కారిడార్లల్లో కవర్ అవుతాయి. బెంగుళూరు - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు, తదితర ప్రాంతాలు కవర్ అవుతాయి. ఈ మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏపీలోని వివిధ ప్రాంతాలను కవర్ చేస్తాయి. హైదరాబాద్, అమరావతి, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలు అన్ని అనుసంధానం అవుతాయి. డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్లో ఏపీ కూడా ఉంది. అత్యంత విలువైన భార ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపకరించే అవకాశం ఉంది' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్‌కు రూ.40 వేల కోట్లు పెట్టారు. టెక్స్ టైల్ సెక్టార్‌కు కూడా ఊతమిచ్చారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'మన రాష్ట్రానికి ఈ అంశం చాలా ఉపకరిస్తుంది. పర్యాటకానికి, హాస్పిటాలిటీకి కూడా ప్రాధాన్యం ఇచ్చారు.

# దేశాభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణకు దోహదం

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై అనేక మంది ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదే సమయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా నిర్మలమ్మ బడ్జెట్‌ను ప్రశంసించారు. వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ దేశాభివృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, రైతులు, యువత మీద ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. బడ్జెట్‌పై ఆయన ప్రకటన విడుదల చేశారు. విదేశీ టూర్లపై పన్ను తగ్గింపు పౌర విమానయాన రంగానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు. 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్' లక్ష్యాలను మరింత వేగంగా చేరుకునేందుకు సాయపడుతుందని అన్నారు. అదేవిధంగా పౌర విమానాల విడిభాగాలపై ట్యాక్స్ తగ్గించడం శుభపరిణామమని తెలిపారు.నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బ్జడెట్ స్థిరమైన ఆర్థిక విధానంతో పాటూ పెట్టుబడులు, సంస్కరణ లపై ప్రత్యే దృష్టి పెట్టడం ద్వారా.. దేశానికి మరింత ప్రగతిని, సుస్థిర అభివృద్ధిని తీసుకురాగలిగిందని ఆయన అన్నారు.

# అధికార లాంఛనాలతో.. ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య అంత్యక్రియలు.













**శ్రద్ధాంజలి ఘటించిన మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, పోచారం, ఎక్సైజ్ శాఖ కార్యదర్శి, కలెక్టర్, సీ.పీ.**

**సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్ గ్రేషియా,**

**కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం.**

**రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఫిబ్రవరి 01**

: విధి నిర్వహణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో గంజాయి స్మగ్లర్ల దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుల్ కుమారి గాజుల సౌమ్య(24) అంత్యక్రియలను ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార లాంఛనాలతో ఆదివారం నిర్వహించారు. హైదరాబాద్ లో చికిత్స పొందుతూ మృతి చెందిన సౌమ్య పార్థివదేహం ఆదివారం సాయంత్రం 4.00 గంటల సమయానికి ఆమె స్వస్థలమైన నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రానికి చేరుకుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఖురేషి, డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, సూపరింటెండెంట్ మల్లారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సౌమ్య మృత దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సౌమ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు భరోసా కల్పించారు. విధి నిర్వహణలో సౌమ్య కనబర్చిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమని శ్లాఘించారు. ఎంతో భవిష్యత్తు కలిగిన సౌమ్య చిన్న వయసులో అసువులు బాసిందని, ఈ సంఘటన యావత్ సమాజాన్ని తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. వీర మరణం పొందిన సౌమ్య బలిదానం వృధా కానివ్వమని, ఆమె మృతికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్ గ్రేషియా అందించడంతో పాటు, కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తుందని ప్రకటించారు. అదేవిధంగా ఆమె కుటుంబానికి పూర్తి జీతభత్యాలతో కూడిన పెన్షన్ అందిస్తామన్నారు. భవిష్యత్తులో ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని, ఎక్సైజ్ సిబ్బందికి కూడా ఆయుధాలు కేటాయించే అంశాన్ని పరిశీలిస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. విధి నిర్వహణలో ఉన్న వారిపై భవిష్యత్తులో ఎవరు కూడా ఈ తరహా దాడులు చేసేందుకు భయపడేలా అవసరమైతే మరింత కఠిన చట్టాలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. యువతను నిర్వీర్యం చేసే గంజాయి వంటి మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను రాష్ట్ర పొలిమేరల వరకు తరిమికొట్టేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ఇందులో భాగంగానే గంజాయి స్మగ్లర్లను పట్టుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం ఆవేదన కలిగించిందని అన్నారు.



కాగా, పోలీసు లాంఛనాలతో సౌమ్యకు తుది వీడ్కోలు పలుకగా, ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు సౌమ్య అమర్ హై అని దారి పొడుగునా నినాదాలు చేస్తూ విషణ్ణవదనాలతో అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సౌమ్య మృతితో మోస్రా గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

వేగుచుక్క



# సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద సమంత-రాజ్..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంతగురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'ఏమాయ చేశావే' మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిన్నది.. ఇండస్ట్రీకి వచ్చిన అనతికాలంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్‌కి వెళ్లిపోయింది. ఇక అక్కినేని హీరో నాగచైతన్యతో ప్రేమలో పడి అతన్నే మ్యారేజ్ చేసుకున్న ఈ బ్యూటీ ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకొని విడిపోయారు. ఆ తర్వాత రీసెంట్‌గా బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో పెళ్లిపీటలెక్కింది. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్‌లో యోగా ఆశ్రమంలో ఉన్న లింగ భైరవి ఆలయంలో వీరి పెళ్లి జరిగింది. ఇక మ్యారేజ్ తర్వాత మళ్లీ తమ ప్రొఫెషనల్ వర్క్‌లో బిజీ అయిపోయింది సమంత. 'శుభం' సినిమాతో నిర్మాతగా సక్సెస్ అందుకున్న సామ్ ఇప్పుడు 'మా ఇంటి బంగారం' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాకు కూడా సామ్‌నే నిర్మాతగా వ్యవహరిస్తోంది. దీనికి లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఇందులో బాలీవుడ్ ప్రముఖ నటుడు కాంతార విలన్ గుల్షన్ దేవయ్య, దివ్యేందు కీలక పాత్రలో నటిస్తున్నారు.ఇదిలా ఉంటే.. తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే సమ్మక్క సారలమ్మ జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ అని మనందరికీ తెలిసిందే. ఈ జాతరకు భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లం) సమర్పించు కుంటారు. ఈ క్రమంలో కొత్తగా పెళ్లి అయిన సమంత-రాజ్ నిడిమోరు కూడా సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకున్నట్లు ఓ ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. సమంత పసుపు పచ్చ చీర కట్టుకొని ఉండగా రాజ్ మాత్రం వైట్ కలర్ ధోతిలో ఉన్నాడు. ఇక వీరిద్దరిపై పసుపు కుంకుమ పడి ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబధించిన ఫొటో నెట్టింట వైరల్‌గా మారగా.. ఇది ఏఐ ఫొటో అని కామెంట్స్ చేస్తున్నారు.

# 'డబుల్' హ్యాపీలో రామ్‌చరణ్..



కవలల రాకతో మెగా ఫ్యామిలీలో సంతోషాలు వెల్లివిరిశాయి. రామ్‌చరణ్-ఉపాసనలకు జనవరి 31న రాత్రి బాబు, పాప పుట్టాడని చిరంజీవి సోషల్ మీడియా వేదికగా గుడ్‌న్యూస్ చెప్పాడు. తాజాగా ఈ శుభవార్తను చరణ్-ఉపాసన దంపతులు ఓ స్పెషల్ ఫోటో ద్వారా తమ అభిమానులతో పంచుకున్నారు. బాబు, పాప పుట్టారన్న విషయాన్ని మీతో పంచుకోవడం సంతోషంగా ఉంది. ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడిని కలిగి ఉన్నందుకు చాలా ఆనందంగా ఉంది. మన జీవితంలో మహిళలే గొప్ప బలం. మాకు ఎల్లప్పుడూ అండగా నిలిచిన అభిమానులకు, కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక ధన్యవాదాలు అని రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌కు భార్య గర్భంతో ఉన్నప్పుడు దిగిన ఓ ఫోటోను జత చేశారు.

అందులో చరణ్ దంపతులు బ్లాక్ డ్రెస్ ధరించగా.. రెండు శునకాలను పట్టుకుని ఠీవీగా నిల్చున్నారు. కాగా రామ్‌చరణ్, ఉపాసన 2011 డిసెంబర్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. 2012 జూన్‌లో పెళ్లి చేసుకున్నారు. వీరికి 2023లో కూతురు క్లీంకార జన్మించింది. ఇప్పుడు క్లీంకారతో ఆడుకునేందుకు మరో బుజ్జి పాపాయి, బుడ్డోడు కుటుంబంలో చేరారు.

# అరిచి అరిచి గొంతు పోయిందన్న శ్రీలీల..



'పెళ్లి సందడి' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల తక్కువకాలంలోనే టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. స్టార్ సినిమాలతో అవకాశాలు అందుకుంటూ కెరీర్‌లో దూసుకు పోతోంది. అయితే కొంతకాలంగా తనకు హిట్ల కంటే ఫ్లాపులే ఎక్కువవుతున్నాయి. ప్రస్తుతం శ్రీలీల తెలుగులో 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పాటు హిందీలోనూ కార్తీక్ ఆర్యన్‌తో ఓ సినిమా చేస్తోంది. అలాగే ధనుష్ సినిమాలోనూ హీరోయిన్‌గా నటించే ఛాన్స్ కొట్టేసింది. ఇకపోతే సినిమాలతో పాటు ఈవెంట్స్‌కు కూడా హాజరయ్యే

ఈ బ్యూటీ తాజాగా ఓ కాలేజీ ఫెస్ట్‌కు వెళ్లింది. నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ఫంక్షన్‌కు హాజరై సందడి చేసింది. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ.. మిమ్మల్ని చూసిన జోష్‌లో అరిచి అరిచి గొంతు పోయిందంది. అందుకు అక్కడున్న అబ్బాయిలు.. అయితే డ్యాన్స్ చేయమని అరిచారు. అది విన్న శ్రీలీల.. నిజంగా పెళ్లాన్ని అడిగినట్లు అడిగారు, డ్యాన్స్ చేద్దాం.. కమాన్ అంటూ పాజిటివ్‌గా స్పందించింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# టాలీవుడ్ సీనియర్ నటుడు కన్నుమూత..

## నెలరోజుల క్రితమే కొడుకు మృతి



టాలీవుడ్ ఇండస్ట్రీలో సీనియర్ నటుడి మరణం తీవ్ర విషాదాన్ని నింపింది. 350కి పైగా సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కలకోట రఘునాథరెడ్డి (56) గుండెపోటుతో ఆకస్మికంగా మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో సీనియర్ నటుడి మరణం తీవ్ర విషాదాన్ని నింపింది. 350కి పైగా సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కలకోట రఘునాథరెడ్డి (56) గుండెపోటుతో ఆకస్మికంగా మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. శనివారం (జనవరి 31) రాత్రి గుండెపోటుతో కన్నుమూశారని తెలిపారు. నెలరోజుల క్రితమే ఆయన కొడుకు కూడా గుండెపోటుతోనే చనిపోవడం గమనార్హం. కుమారుడిని కోల్పోయిన బాధతోనే ఆయన దీర్ఘఆలోచనలో పడ్డారని, ఆ ఆవేదనతోనే గుండెపోటుకు గురై మరణించినట్లు తెలుస్తోంది. 1970, జనవరి 1న జన్మించిన రఘునాథరెడ్డి ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడ నివాసి. ఆయన భౌతిక కాయానికి నటి శివపార్వతి నివాళులు అర్పించారు. సీనియర్ నటుడు, ఎన్నో సహాయపాత్రలు చేసిన వ్యక్తి మరణిస్తే టాలీవుడ్ పట్టించుకోకపోవడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రఘునాథరెడ్డి కలిసుందాం రా, ఒసేయ్ రాములమ్మ, ఇంద్ర, డాన్, తమ్ముడు, రాయలసీమ రామన్న చౌదరి, మల్లీశ్వరి, సంక్రాంతి, శ్రీరామరాజ్యం, భద్ర తదితర సినిమాల్లో నటించారు. శోభన్ బాబు హీరోగా నటించిన సర్పయాగం సినిమాతో ఆయన ఇండస్ట్రీకి నటుడిగా పరిచయమయ్యారు. రఘునాథరెడ్డి చివరిగా 2018లో సుమంత్ హీరోగా చేసిన సుబ్రహ్మణ్యపురంలో నటించారు.

# కోలీవుడ్ డైరెక్టర్‌తో వరుణ్ తేజ్ కమర్షియల్ మూవీ



వరుస పరాజయాలతో సతమతమవుతున్న మెగా హీరో వరుణ్ తేజ్ , ఈసారి ఎలాగైనా సక్సెస్ ట్రాక్ ఎక్కాలని పట్టుదలతో ఉన్నాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కొరియన్ కనకరాజు' చిత్రంపై ఆయన ఆశలు పెట్టుకున్నాడు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా కొరియన్ పోలీస్ స్టేషన్ నేపథ్యంలో సాగే సీన్లు, తమన్ అందించిన భయపెట్టే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, వరుణ్ తేజ్ వైలెంట్ లుక్ ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. హారర్ కామెడీ జానర్‌లో సరికొత్త కొరియన్ టచ్‌తో వస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది వేసవి కానుకగా విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, వరుణ్ తేజ్ తన తదుపరి చిత్రం కోసం కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో చేతులు కలపబోతున్నారనే వార్త నెట్టింట సంచలనంగా మారింది. 'జవాన్'తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన అట్లీ, వరుణ్ తేజ్ కోసం ఒక భారీ కమర్షియల్ యాక్షన్ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కాంబినేషన్ గురించి తెలిసిన నెటిజన్లు 'ఇదెక్కడి మాస్ కాంబో మామా!' అంటూ సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. ఒకవేళ ఇది నిజమైతే, వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్ కానుంది. ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' షూటింగ్ పనుల్లో బిజీగా ఉండగా, ఇందులో 'మిరాయ్' ఫేమ్ రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. రొటీన్ ఇండియన్ హారర్ కథలకు భిన్నంగా, అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రం వరుణ్ తేజ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుందని అంతా అనుకుంటున్నారు.

# అత్యంత సవాలుతో కూడిన పాత్ర



అదితి రావ్ హైదరీ మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. గతంలో 'రాక్‌స్టార్' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఆమె, ఇప్పుడు ఇమ్తియాజ్ అలీ క్రియేట్ చేసిన 'ఓ సాథీ రే' ద్వారా ఆయనతో కలిసి పని చేస్తోంది. నెట్‌ఫ్లిక్స్ నిర్మాణంలో వస్తున్న ఈ పీరియాడికల్ లవ్ స్టోరీపై అదితి స్పందిస్తూ.. ఇమ్తియాజ్ అలీతో పనిచేయాలనే తన చిరకాల కోరిక ఈ సినిమాతో నెరవేరిందని వెల్లడించింది. ఈ మూవీ షూటింగ్ సమయంలో ఇమ్తియాజ్ అలీ పనితీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని అదితి పేర్కొంది. "ఇమ్తియాజ్ మానిటర్ వైపు కూడా చూడరు, నేరుగా నటుల వైపు చూస్తూ సీన్ ఎలా వస్తుందో గమనిస్తారు. ఆయన ఎనర్జీ, అప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేసే తీరు నటిగా నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది" అని తెలిపింది. 'ఓ సాథీ రే' భావోద్వేగపరంగా చాలా లోతైన కథ అని, తన కెరీర్‌లో ఇది అత్యంత సవాలుతో కూడిన పాత్ర అని ఆమె చెప్పుకొచ్చింది. అయితే ఇలాంటి క్లిష్టమైన పాత్రలు చేయడమే ఒక నటిగా తనకు గొప్ప సంతృప్తిని ఇస్తుందని అదితి స్పష్టం చేసింది. ఇక ఈ సినిమాలో తన కో-స్టార్స్ గురించి కూడా అదితి ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'గర్ల్ ఆన్ ఏ ట్రైన్' తర్వాత మళ్ళీ అవినాష్ తివారీతో కలిసి నటించడం ఆనందంగా ఉందని, ఆయన ఒక మంచి స్నేహితుడని తెలిపింది. అలాగే అర్జున్ రాంపాల్‌ను యూనివర్సల్ క్రష్‌గా చెప్తూ ఆయన సెట్స్‌లో చాలా ప్రొటెక్టివ్‌గా ఉంటారని ప్రశంసించింది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు పంకజ్ త్రిపాఠితో కలిసి 'పారివారిక్ మనోరంజన్' అనే చిత్రంలోనూ, అలాగే ఒక సౌత్ థ్రిల్లర్ మూవీలోనూ తాను నటిస్తున్నట్లు అదితి అప్‌డేట్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ అదివి రావు కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# కొత్త మూవీతో వచ్చేస్తున్న సుహాస్

మరో సరికొత్త మూవీతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు వచ్చేస్తున్నాడు హీరో సుహాస్. కొత్త దర్శకుడు గోపీ అచ్చర దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ 'హే భగవాన్' అనే క్యాచీ టైటిల్‌తో రాబోతున్నది. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్', 'లిటిల్ హార్ట్స్' సినిమాలతో యూత్‌ను ఎట్రాక్ట్ చేసిన యంగ్ బ్యూటీ శివాని నాగరం ఇందులో హీరోయిన్‌గా నటిస్తుండగా.. త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేయబోతుండగా.. అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసి ఆడియన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. ఇందులో భాగంగానే తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తూ మరో సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'హే భగవాన్' మూవీ ఫిబ్రవరి 20న రిలీజ్ కాబోతున్నట్లు తెలుపుతూ.. 'ఇది ఫెబ్ మంత్ కాదు.. ఫన్ మంత్' అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌ను జత చేశారు. వీకే నరేష్, వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, అజయ్ ఘోష్, స్రవంతి చొక్కారపు తది తరులు ఇందులో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగే ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన పలు అప్డేట్స్‌తో పాటు టీజర్ ఆకట్టుకోగా.. మూవీపై పాజిటివ్ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి.



# భయపెట్టేలా నవీన్ చంద్ర 'హనీ' ట్రైలర్



నవీన్ చంద్ర, దివ్యా పిళ్లై ప్రధాన పాత్రల్లో నటించిన సైకలాజికల్ హారర్ సినిమా 'హనీ'. కరుణ కుమార్ దర్శకుడు. ఓవీఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించారు. శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఫిబ్రవరి 6న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ క్రమంలోనే ఆదివారం ఈవెంట్ నిర్వహించి ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఇది భయపెట్టేలా ఉండటం విశేషం.నిజ జీవిత సంఘటనల ప్రేరణతో మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజికల్ అంశాలతో 'హనీ' మూవీ తీశారు. ఈ మూవీలో దివి, రాజా రవీంద్ర, బేబీ జయన్ని, బేబీ జయత్రి తదితర ఇతర కీలక పాత్రలు పోషించారు. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాలతో దీన్ని తెరకెక్కించారు. ట్రైలర్ బట్టి చూస్తే.. ఓ దేవత వాహనంగా పిల్లిని చూపించారు. ఇది ఎవరి దగ్గర ఉంటే అందరూ వాళ్లకు దాసోహం అవుతారనే పాయింట్ చెప్పుకొచ్చారు. ఇది ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది.